నీవు. ఒకవేళ నేను ఏదైనా పొరపాట్లు చేసాను అనుకో, నీకు కోపం ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి నన్ను క్షమించి, ఆశీర్వదించి, నీ హృదయంలో నాకు కొంత చోటు ఇయ్యి అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్. యివన్నీ మనం ఎందుకు శ్రవణం చేయాలి అంటే శ్రవణం చేయటం వలన వాటి విలువ మనకు తెలుస్తుంది. సబ్జక్టు శ్రవణం చేయకపోతే లోపల ఉన్న వస్తువు యొక్క విలువ మనకు తెలియదు. ఆ వస్తువు యొక్క విలువ మనకు తెలియకపోతే, దానిని పొందటానికి ప్రయత్నం చేయలేము, ఇంక అది మన సొంతం అవ్వదు. నీ హృదయంలో నేను ఉన్నాను, నీ మనస్సును రవ్వంత లోపలకు తిప్పి అన్వేషించు, అది జ్ఞానయోగం. నాకు ఇష్టమైన పనులు చెయ్యి. నీ ఇష్టాయిష్టాలను ప్రక్కన పెట్టి ఏ రకంగా పనిచేస్తే నా అనుగ్రహానికి పాత్రుడవు అవుతావో ఆ రకంగా పనిచెయ్యి, అది కర్మయోగం. నా నామాన్ని స్మరించుకో, నా రూపాన్ని ధ్యానం చేసుకో అది భక్తియోగం. అన్ని యోగాలు భగవంతుడు చెప్పాడు. మనం భోజనం చేస్తున్నాము అనుకోండి ముద్ద నోట్లో పెట్టుకొనే వరకూ పక్కవారితో వాగుతూ ఉంటాము, ముద్ద నోట్లో పెట్టుకొన్నాక ఇంకపడి ఉంటాము. నోట్లో ఉన్న ముద్ద ఇంక మాట్లాడనివ్వదు. నోరు వాగటం మానదు, మన మనస్సు తిరగటం మానదు. నీ హృదయంలో ఉన్న శాంతి సముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచుతూ ఉంటే మనస్సు తిరగటం ఆగిపోతుంది. ఇంక అప్పుడు శాంతే శాంతి, ఆనందమే ఆనందం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-10-06, కైకలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృతయుగంలో మహావిష్ణువును ధ్యానం చేయటం వలన, త్రేతాయుగంలో యజ్ఞ యాగాలు చేయటం వలన, ద్వాపరయుగంలో అర్చనలు, పూజలు చేయటంవలన, కలియుగంలో నామసంకీర్తన వలన జీవుడు తరిస్తాడు అని చెప్పారు. అయితే నామ సంకీర్తన మనం భక్తిగా, ప్రేమగా, ఇష్టంగా చేయాలి. మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకోండి. మన మనో దేహములకు అతీతంగా, ఈ సృష్టికి అతీతంగా మన హృదయంలో అంతర్యామిగా ఒక సత్యవస్తువు ఉంది అని అన్ని మతాలు చెపుతున్నాయి. దానినే హిందువులు నారాయణుడు అంటున్నారు, క్రైస్తవులు యెహోవా అంటున్నారు, ముస్లిములు అల్లా అంటున్నారు. ఎవరు ఏ పేరు పెట్టి పిలిచినా వస్తువు ఒక్కటే. ఆ వస్తువును తెలుసుకోవటానికి అనేక మతాలు అనేక మార్గాలు చెప్పాయి కాని అన్ని మతాలు చెప్పింది ఒకే వస్తువు గురించి, అది మర్చిపోకండి. మీరందరు ఈ ప్రవచనాలకు ఎందుకు వస్తున్నారు. కాలక్షేపానికి వస్తున్నారా, మీరందరు ఓట్లు వేసి మమ్మల్ని గెలిపించాలా, గౌరవాల కోసమా ఏమీ కాదు. మనిషికి ధనం ఉన్నా, అధికారం ఉన్నా, విద్య ఉన్నా ఎన్ని ఉన్నా వాడిని దుఃఖం విడిచిపెట్టటం లేదు. మీరు

ఏకులస్థులయినా, ఏ మతస్థులయినా మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్లటమే ఈ ప్రవచనాల యొక్క ప్రయోజనం. ఆనంద సాగరం మన హృదయంలో ఉంది. చల్లని నీటిలో మన చేయి పెడితే ఆ చల్లదనం మన స్పర్శకు ఎలా తెలుస్తుందో అలాగ హృదయంలో ఉన్న ఆనందం మన సహస్రారానికి అందాలి. అది అందేవరకు దుఃఖం నశించదు, అశాంతి నశించదు. అహంకారం ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అని భగవాన్ చిన్న వాక్యం చెప్పారు. దానిని జాగ్రత్తగా విడదీసి చూసుకోండి. ఈ మాట మీకు అర్థమయితే మీ దుఃఖం వెంటనే ఆరిపోతుంది, ఇంక మీకు పునర్జన్మలు లేవు. భగవాన్ పది మాటలలో చెప్పేది ఒక మాటలో చెపుతారు. మనిషి నిండుగా, గంభీరంగా ఉంటారు. అవసరంలేని మాట ఒక్కమాట మాట్లాడరు, అవసరమైన మాట విడిచిపెట్టరు, ఆయన రమణమహర్షి. వాసుదేవస్వామి ఏమి చెప్పారు అంటే అహంకారమే చావు, అహంకారమే పుట్టుక, అహంకారమే కామం, అహంకారమే ఆశ అంటే అహంకారమే ఇన్ని రూపాలలో మారుతోంది. అహంకారం ఉన్నంతకాలం ఏదో రూపంలో ఆశ మిమ్మల్ని విడిచి పెట్టదు, మిమ్మల్ని పట్టుకొని పీడించేస్తుంది. ఏదోలాగ అణుచుకొందామన్నా గెంటుకొని గెంటుకొని వచ్చేస్తుంది. ఈ అహంకారం నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంలాగ కనిపింప చేస్తుంది, దీనినే అధ్యాస అంటారు. అహంకారాన్ని వ్యక్తిగతంగా చెప్పినప్పుడు అవిద్య, అజ్ఞానం అంటారు, అందరి అహంకారాలను సమిష్టిగా కలిపి చెప్పినప్పుడు మాయ అంటారు.

యోగం అంటే కలయిక. ఇప్పుడు మనకు దేహంతోటి, మనస్సుతోటి అనుసంధానం ఎలా ఉందో, అలాగ లోపల ఉన్న పరమాత్మతో అనుసంధానం చేసేదే యోగం. అహంకారం నశించాలంటే మనం ధర్మాన్ని ఆచరించాలి. ధర్మం అంటే దానం కాదు, ఒక జీవిత విధానం. ధర్మాన్ని ఆచరించకుండా మనం ఎన్ని కోతిగంతులు వేసినా అజ్ఞానం నశించదు. అసలు నీవు శాంతిగా ఎందుకు ఉండలేకపోతున్నావు, దుఃఖం ఎందుకు వస్తోంది అంటే అధ్యాసలో నుండి దుఃఖం వస్తోంది. నీకు తాడు పాముగా కనిపిస్తోంది అనుకో, నిజంగా అక్కడ పాము లేదు, తాడు పాముగా కనిపిస్తోంది, అప్పుడు నీకు భయం వేస్తుంది, అది కరిచేస్తుంది మనం చనిపోతాము అనిపిస్తుంది. నీకు తాడు పాముగా కనిపిస్తున్నంతకాలం ఎన్ని ప్రాణాయామాలు చేసినా, యోగాభ్యాసాలు చేసిన నిన్ను భయం విడిచిపెట్టదు. నీకు ఉన్నది ఉన్నట్లుగా కనిపించే వరకు లేనిది ఉన్నట్లుగా కనిపిస్తుంది, అది ఎవరూ ఆపుచేయలేరు. బయటముడి అయితే విప్పకోవటానికి ఎవరైనా సహాయం చేస్తారు ఇది లోపల ఉన్న ముడి. స్వప్రయత్నం, కాల పరిపక్వం, ఈశ్వరకటాక్షం లేకపోతే లోపల ఉన్న ముడిని విప్పలేవు. నీ తెలివితేటల వలన ఆ ముడిని విప్పకోలేవు. ధర్మాన్ని ఆచరిస్తే, వ్యక్తిభావన లేకుండా ఈశ్వర

ప్రీత్యర్థం నీవు పనిచేస్తూ ఉంటే, ఆయన కోసమే జీవిస్తూ ఉంటే ఆయనే ఆ ముడిని విప్పిపెట్టి, మనం విప్పకొన్నామన్న భావన కలుగజేస్తాడు, ఆయన భగవంతుడు. మీరు ఎవరైనా 10 కోట్లు సంపాదించారు అనుకోండి, పదికోట్లు నేను సంపాదించాను అని అనుకొంటారు. మీకు కలిసివచ్చేటట్లు ఉపాయం చేసినవాడు ఈశ్వరుడు. కాని మీరు ఏమనుకొంటున్నారు నా తెలివి వలన సంపాదించాను అనుకొంటున్నారు. అజ్ఞానం అంతా అక్కడే ఉంది. ఇచ్చింది ఈశ్వరుడు. అది ఈశ్వరుడు ఇచ్చాడు అనే గుర్తింపు మనకు రావాలి. మనకంటే తెలివైన వారు చాలామంది ఉన్నారు, మరి వారికి ఎందుకు డబ్బు కలిసి రావటం లేదు.

ఉన్నది ఒకటి, మీకు కనిపించేది ఇంకొకటి. ఇదే అధ్యాస. అజ్ఞానంలోనుండి అధ్యాస వస్తుంది, అధ్యాసలో నుండి దుఃఖం వస్తుంది. గాఢనిద్రలో, స్వప్నంలో, జాగ్రదవస్థలో మూడు అవస్థలలోను అజ్ఞానం ఉంది. ఈ మూడు అవస్థలు అబద్ధమే, ఈ అవస్థలు అన్నీ అహంకారానికే. జాగ్రదవస్థ, స్వప్నావస్థలలో మీకు దుఃఖం వస్తోంది. గాఢనిద్రలో సుఖం మీకు తెలియకపోయిన అక్కడ దుఃఖం లేదు. అజ్ఞానం మూడు అవస్థలలో ఉంది కదా మరి గాఢనిద్రలో దుఃఖం ఎందుకు రావటంలేదు. జాగ్రదవస్థ స్వప్నం రెండింటిలో అధ్యాస ఉంది. గాఢనిద్రలో నీకు అధ్యాస లేదు కాబట్టి అక్కడ దుఃఖం లేదు. గాఢనిద్రలో ఒక వస్తువు ఇంకో వస్తువుగా నీకు కనబడటం లేదు. జాగ్రదవస్థ వచ్చేటప్పటికి అధ్యాస వస్తోంది, సత్యం అసత్యంగా నీకు కనబడుతోంది, అందుచేత దుఃఖం వస్తోంది. సత్యం ఏమిటో నీకు అర్థమయ్యేవరకు కోటి జన్మలు ఎత్తినా సత్యం అసత్యంగా కనిపించటం మానదు. మనకు రోగం తగ్గనప్పడు ఎన్ని హాస్పటల్స్‌కు తిరిగినా ఒకటే అలాగే మనకు అజ్ఞానం తగ్గనప్పడు మనం ఏమతంలో ఉన్నా, ఏ దేవుడిని ఆరాధించినా ఒక్కటే. ఆధ్యాత్మికమార్గంలో మనం ముందుకు వెళ్ళలేకపోవటానికి కారణం మనకు ఆత్మ విశ్వాసం లేదు. ఆరు, నాలుగు కలిపితే పది, దారినపోయే వాడు వచ్చి ఆరు, నాలుగు కలిపితే పది కాదు, పదకొండు అంటే నిజమే అనుకొంటాము, ఇంక మీరు దేనికి పనికిరారు. మీకు లెక్కలు తెలియకపోవటం వలన, మీమీద మీకు విశ్వాసం లేకపోవటం వలన అలా తయారయ్యారు. దారిని పోయేవాడు చెప్పింది కాదు, శాస్త్రంలో ఏదైతే ఉందో దానిని హృదయపూర్వకంగా చెయ్యి, చేసేది చేసి వదిలెయ్యి. మన దగ్గర తింగరతనం ఎక్కడ ఉంది అంటే మనం మంచి పనిచేసాము, అందరూ చెప్పకొంటున్నారా లేదా అని చూస్తాము. నీవు మంచిపని చేసి వదిలెయ్యి, దానికి చిలవలు, పలవలు అల్లుకొని నీ బుద్ధిని పాడుచేసుకోవద్దు. లెక్కలు బాగా వచ్చినవాడు అయితే ఆరు నాలుగు పదకొండు అని చెపితే నవ్వుకొని ఊరుకొంటాడు కాని వాడిని పట్టించుకోడు. మనకు ఉన్న శాంతి నిజమైతే, మనకు ఉన్న జ్ఞానం నిజమైతే సమాజం

మనలను ఏమీ చేయలేదు, సమాజం యొక్క ప్రభావం మన మీద పడదు, జ్ఞాని ఒక్కడు మాత్రమే స్వతంత్రుడు. నిప్ప కాల్చకుండా ఉండలేదు అలాగే జ్ఞాని ప్రేమించకుండా ఉండలేడు. వాడు అలా చెప్పాడు, వీడు ఇలా చెప్పాడు అంటే నీకు జ్ఞానం లేక వారు చెప్పిన మాటలు, వీరు చెప్పిన మాటలు బుర్రలో వేసుకొని శుభ్రంగా పాడైపోయి, చనిపోయే రోజు వచ్చేసరికి కుళ్ళిపోయి చివరకు నరకానికి వెళ్ళటం. మనం చేసేది ఏమిటి అంటే బతికి ఉన్నంత కాలం నరకానికి మెట్లు కట్టుకొంటున్నాము.

కొంతమందికి పొగడ్తలు, గౌరవాలు అంటే ఇష్టం. వేశ్య యొక్క వలలో పడినవాడు ఎప్పడైనా బయటకు వస్తాడు గాని ఈ పొగడ్తలు, సన్మానాలకు అలవాటు పడినవాడు అందులోనుండి బయటకు రాలేడు అని పరమాత్మ చెప్పాడు. మీరు ఎవరినైనా తిట్టండి వాడు పైకి ఏమీ అనకపోయినా లోపల దుఃఖపడతాడు, ఆ దుఃఖపడేవాడు దొంగ. వాడిలో నుండి బయటకురా అంతవరకు నిన్ను దుఃఖం విడిచి పెట్టదు. నిర్వాణసుఖం, మోక్షం పొందాలంటే ఈ సృష్టిలో ఎలా బతకాలో మహమ్మద్ ప్రవక్త చెప్పారు. మనం దారి వెంట నడిచి వెళుతూ ఉంటే ఆ ప్రక్కన, ఈ ప్రక్కన ముళ్ళకంపలు ఉన్నాయి అనుకోండి. అవి మన బట్టకు, శరీరానికి గుచ్చుకోకుండా ఎంతో జాగ్రత్తగా వెళతాము. అలాగే ఈ లోకంలో రాగద్వేషాలు, అసూయ, లాభనష్టాలు ఇలాగ ఎంతో పెంట ఉంది. ఆ ముళ్ళకంపలు గుచ్చుకోకుండా ఎంత జాగ్రత్తగా బయటకు వస్తున్నావో అంత జాగ్రత్తగా ఈ పెంట ఏమీ నిన్ను అంటుకోకుండా ఈ లోకంలోనుండి బయటకురా, అప్పడు కదా నీవు స్వర్గరాజ్యాన్ని పొందేది అన్నాడు. రాగద్వేషాలు వచ్చిన తరువాత పోగొట్టుకోవటం తరువాత విషయం, అసలు ఎందుకు వస్తున్నాయి, అధ్యాస వలన వస్తున్నాయి అంటే సత్యంకానిదానిని సత్యం అనుకోవటం వలన వస్తున్నాయి. చెడ్డవారు సుఖంగా బతుకుతున్నారు, మంచి వారికి ఎక్కువగా కష్టాలు వస్తున్నాయి అని అడుగుతున్నారు. మనకు కష్టాలు వస్తున్నాయి అనుకోండి, అవి ఈశ్వరుడికి తెలియకుండా రావటం లేదు. చావులు, పుట్టుకలు, సంపద, అధికారం ఉండటం లేకపోవటం, దారిద్ర్యం ఇది అంతా మాయ. నా పాదాలను ఆశ్రయించకుండా నా మాయలో నుండి ఎవరూ బయటకు రాలేరు అని పరమాత్మ చెప్పాడు. భగవంతుడు నీమీద ఇష్టం లేక కష్టాలు పంపుతున్నాడా, నీ మీద ఇష్టం లేకకాదు, మంచివారిని తొందరగా తరింపచేయాలని అనుకొంటున్నాడు. బంగారాన్ని కాలిస్తేనేగాని పరిశుద్ధం అవ్వదు. మీ మనస్సును మెరిసేటట్లు చేయటానికే కష్టాలు పంపుతున్నాడు. మనం మంచివారమే కాని మన బుద్ధి ఇంకా పక్వానికి రాలేదు. మనం చేదుగా, పుల్లగా ఉన్నాము. ఆ పుల్లదనాన్ని, చేదుతనాన్ని తీసేసి తేనె ఎంత తియ్యగా ఉంటుందో అంత తీయగా చేయటానికి కష్టాలు పంపుతున్నాడు. అది తెలిసిన వారు ధన్యులు.

నీ సంసారం కూడా అహంకారమే. సంసారం అంటే ఆవరణ, అది ఒకదొడ్డి, ఒకనుయ్యి. ఆ గోతిలో నుండి నీ తెలివితేటల వలన బయటకు రాలేవు, నీ అహంకారానికి అంతప్రజ్ఞ ఉందా, నా అనుగ్రహం లేకుండా ఆ గోతిలో నుండి బయటకు రాలేవు, కోటి జన్మలు ఎత్తినా అందులోనుండి బయటకు వచ్చే సమస్య లేదు అంటున్నాడు పరమాత్మ. శాస్త్రాన్ని వదిలేసి, రోడ్డునపోయే వాడి మాటల ప్రభావం నీ బుర్ర మీద పడుతూ ఉంటే నీవు మూర్ఖుడవు అని ఇంక వేరే చెప్పనక్కరలేదు. మనం గుడికి వెళ్ళి ఏది అడగాలో తెలియక అది కావాలి, ఇది కావాలి అని అడుగుతాము. నీ దయ ప్రసాదించు, నీదయ లేకుండా ఈ మాయలోనుండి బయటకు రాలేను అని అడిగేవారు ఎంత మంది ఉన్నారు. ఆయన అనుగ్రహం ఉంటే ఈకష్టాల నుండి, బాధల నుండి బయటకు వస్తాము, మోక్షం కూడా పొందుతాము. ఈశ్వరుడి పాదాల మీద భక్తి కలగటం మీరు అనుకొన్నంత తేలిక కాదు. మనకు పూర్వ పుణ్యం లేకపోతే, ఎంతోకొంత కృషిలేకపోతే మనకు భక్తి కలుగదు. ఆయన కృప లేకుండా కృషి రాదు, కృషి లేకపోతే భక్తిరాదు.

మన కులమతాలతో, మనకున్న ఆస్తులతో, రాగద్వేషములతో ఇప్పడు మనకు ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ లోపల ఉన్న నారాయణుడితో, హృదయంలో ఉన్న సత్యవస్తువుతో తాదాత్మ్యం వస్తే, దానికి సంబంధించిన ఎరుకనీకు కలిగితే అది జ్ఞానం. అక్కడ టీచర్ వాడి శిష్యుడికి బోధిస్తూ రెచ్చిపోయి, ఆనందాన్ని కక్కుతూ చెపుతాడు. లోపల ఉన్న వస్తువు యొక్క ఎరుక నీకు కలిగిందా ఇంక పునర్జన్మ లేదు, బంధం లేదు, అక్కడ దుఃఖ స్పర్శ లేదు. యోగా చేస్తూ ఉంటే బిపి, షుగర్ తగ్గవచ్చు, అందుకా నీవు యోగాభ్యాసం చేసేది. మన దగ్గర ధాన్యం కొని ఆడిస్తాడు. ఆడించినప్పడు చిట్టు, తవుడు వస్తాయి. చిట్టు తవుడుకోసం వాడు ధాన్యం కొనటంలేదు, బియ్యంకోసం కొనుక్కొంటాడు. అదేవిధంగా మనం యోగాభ్యాసం చేసినా, ధర్మాన్ని ఆచరించినా కేవలం భగవంతుని దయకోసం, మోక్షం పొందటం కోసమే. ఈ లోపుగా మీకు ధనం రావచ్చు, గౌరవాలు రావచ్చు, రోగాలు తగ్గవచ్చు ఇవన్నీ అప్రధానమైన విషయాలు. ఈ మధ్య అమెరికాలో ఒక పెద్ద ధనవంతుడిని విలేఖరి ఒక ప్రశ్న అడిగాడు. మీకు వచ్చిన ఆదాయంలో నూటికి 50 పైసలు ఉంచుకొని మిగతా 50 పైసలు ప్రజలకోసం ఖర్చు చేస్తున్నారు, మీకు డబ్బు అంటే ఇష్టం లేదా అని అడిగాడు. నాకు డబ్బు అంటే ఇష్టం లేకకాదు, ఎవరినో ఉద్ధరించాలి అని నేను పంచిపెట్టటంలేదు, డబ్బును అలా ఖర్చు చేయటం వలన నాకు శాంతి, ఆనందం కలుగుతోంది. మనిషికి కావలసింది డబ్బు కాదు, శాంతి, ఆనందం కావాలి. డబ్బును సద్వినియోగం చేయటంలో నాకు శాంతి ఆనందం కలుగుతున్నాయి అని చెప్పాడు. గీతను అధ్యయనం చెయ్యి, విష్ణుసహస్రనామాలను పారాయణం చేసుకో, సత్పురుషులతో సహవాసం చెయ్యి, నీకు కలిగి ఉంటే సమాజంతో పంచుకో అని ఆచార్యులవారు చెప్పారు. మీకు ఉన్న

దంతా మీరే తినేయటం కాదు, కొంత సమాజంతో పంచుకోండి. సమాజానికి చేసేది ప్రేమతో, ఇష్టంతో చేయండి. నీకు గాఢనిద్రలో దుఃఖం లేదు, సుఖం నీకు తెలియటం లేదు. నీకు మోక్షం వచ్చినప్పుడు దుఃఖం ఉండదు, అక్కడితో ఆగిపోదు సుఖం, శాంతి తెలుస్తూ ఉంటుంది, అదే మోక్షం. దేహగతమైన నేను, మనోగతమైన నేను అక్కడ ఉండదు కాని నీవు ఉంటావు, ఎలా ఉంటావు అంటే ఆనందంలో, శాంతిలో ఊగిసలాడతావు. ప్రారబ్దం ఎవరికి అని భగవాన్‌ను అడుగుతున్నారు. ప్రారబ్దం అనుభవించేది దొంగ నేను, సత్యానికి వీటితో సంబంధం లేదు. ఇప్పుడు స్వప్న శరీరానికి కురుపులు వేసాయి అనుకో, చీముకారిపోతోంది అనుకో, మెలుకువ వచ్చాక ఆ దేహానికి వేసిన కురుపులు అబద్ధం అని నీకు తెలుస్తుంది. అలాగే నీకు జ్ఞానం కలిగాక ఇప్పుడు ఈ దేహం అనుభవించే ప్రారబ్దం అంతా అబద్ధం, ఇది దొంగ ప్రారబ్దం అని నీకు తెలుస్తుంది. మిధ్యానేను ఎంత నిజమో ఈ ప్రారబ్దం కూడా అంతే నిజం. స్వప్నం జరుగుతున్నంతసేపు ఆ స్వప్నం నిజం అనిపిస్తుంది, మెలుకువ వచ్చాక అది నిజంకాదు అని మనకు తెలుస్తుంది. అలాగే జ్ఞానం కలిగాక ఈ దేహం, లోకం, అహంకారం ఇవన్నీ నిజం కాదు అని నీకు తెలుస్తుంది.

మనందరకు డబ్బు లేకపోయిన ఒక శవం ఉంది కదా, ఆ శవాన్ని వేసుకొని తిరుగుతున్నాము, ఆ శవబుద్ధిని ఊడగొట్టటానికే నీకు కష్టాలు పంపుతున్నాడు కాని నీ మీద ఇష్టం లేకకాదు. ఏదో రూపంతోటి, ఏదో నామంతోటి తాదాత్మ్యం పొందినప్పుడు నీకు ప్రారబ్దం కాని ఆపేరు, ఆ రూపం నీవు కాదని తెలిసినప్పుడు నీకు ప్రారబ్దం ఏమిటి? నీ లోపల ఉన్న చైతన్యానికి ప్రారబ్దం ఏమిటి? పుట్టిన దానికి ప్రారబ్దం గాని, పుట్టనిదానికి ప్రారబ్దం ఏమిటి? ఇక్కడే సమస్య పరిష్కారం అయిపోతుంది. తప్పు ఒప్పుల మధ్య, స్వర్గ నరకాల మధ్య నిన్ను తిప్పటానికి భగవాన్ రాలేదు. ఎక్కడ తప్పు ఒప్పులు లేవో, ఎక్కడ పుణ్య పాపాలు లేవో, ఎక్కడ స్వర్గ నరకాలు లేవో అక్కడికి నిన్ను తీసుకొనిపోవటానికే రమణభగవాన్ చెపుతున్నారు. జనాన్ని, భక్తులను పోగుచేసు కోవటానికి ఆయన ఇక్కడకు రాలేదు. నీ దుఃఖాన్ని ఆర్పటానికి వచ్చాడు. నీవు ఏ మతస్థుడవు అయిన, ఏ కులస్థుడవు అయినా ఆయనకు ఒక్కటే పని, అహంకారాన్ని తినటమే ఆయన పని. నీ అహంకారం నశించకుండా దుఃఖం నశించదు. ఎందుచేతనంటే దుఃఖం అంతా అహంకారరూపంలో ఉంది, వ్యక్తి భావన రూపంలో ఉంది. భగవంతుడిని కాదని నేను ఏదో సాధించగలను అని చెప్పే పొగరుబోతు నేను ఉంది కదా, వాడు చస్తేగాని దుఃఖం నశించదు. ఆ పొగరుబోతు నేనును తినటానికే భగవాన్ వచ్చారు. అక్కడ లాభం వచ్చింది, ఇక్కడ నష్టం వచ్చింది అని ఏదో అనుకొంటూ ఉంటారు. అక్కడ లాభం వచ్చినా, ఇక్కడ నష్టం వచ్చినా చేసేవాడు

ఒకడు ఉన్నాడు. వాడు లేడని నీకు తెలిస్తే ఇంక లాభం ఏమిటి? నష్టం ఏమిటి? అదీ నిన్ను బాధించదు, ఇదీ నిన్ను బాధించదు. బ్రహ్మజ్ఞాని వాడికి దేహం ఉన్నా దేహం లేనివాడితో సమానము. ఎందుచేతనంటే వాడికి దేహం ఉన్నా దేహంతో వాడికి తాదాత్మ్యం ఉండదు, వాడి ఏదిగా ఉన్నాడో దానితో తాదాత్మ్యం ఉంటుంది, అందుచేత వాడికి దేహం ఉన్నా లేని వాడితో సమానము. పుణ్యకర్మలు, పాపకర్మలు, వాసనలు, నేను ఆ పని చేసాను, నేను ఈ పని చేసాను అనే తలంపులు అన్నీ ఎక్కడ ఉన్నాయి, మనస్సులో ఉన్నాయి. నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అని దేహం అనుకోదు, మనస్సే అనుకొంటుంది. ఆ మనస్సు ధ్వంసమయితే ఏమీ లేదు. జ్ఞానిని చూసి వాడు బాధపడుతున్నాడు అని మీరు అనుకోవచ్చుగాని నేను బాధపడుతున్నాను అనుకొనేవాడు అక్కడ లేడు. భగవాన్‌కి కేన్సర్ వచ్చింది. చూసేవారికి ఆయన ప్రారబ్దాన్ని అనుభవిస్తున్నాడు. ఒకసారి భగవాన్ అన్నారు నాకు ఒక దేహం ఉందని, ఆ దేహానికి రెండు చేతులు ఉన్నాయని, ఒక చేతిమీద కురుపు ఉందని మీరు చెపుతూ ఉంటే నాకు తెలుస్తోంది అని చెప్పారు. లోకంలో ఉండగా లోకానికి అతీతుడు, దేహంలో ఉండగా దేహానికి అతీతుడు, వాడే జ్ఞాని. కర్త ఉంటే కర్మ వాడిని పీడిస్తుంది. కర్త లేనివాడిని కర్మ ఏమి పీడిస్తుంది. శరీరం ఉన్న వాడికి రోగం కాని శరీరం లేనివాడికి రోగం ఏమిటి?

మీరు మంచి పని చేసారు అనుకోండి, ఎవరూ గుర్తించరు అనుకోండి, మీకు బాధ వస్తుంది. ఇంట్లో చాలా చాకిరి చేస్తున్నాము, ఎవరూ గుర్తించటం లేదు అంటారు. గుర్తింపులు లేకుండా మనస్సుకు అస్థిత్వం లేదు. ఇంట్లో ఏడుపు, బయటకు వస్తే ఏడుపు, ఎక్కడికి వెళ్ళినా ఏడుపే, గుర్తింపుల వలన వచ్చే గోల ఇది. గుర్తింపు లేకుండా అహంకారం బతకలేదు. ఆ గుర్తింపులు మీ కొంపలు తీస్తున్నాయి అని మీకు అర్థమవ్వటం లేదు. వీటి వలన పునర్జన్మలకు వాసనలు పడతాయి. ఈ దేహం నేను అనుకొని పని చేస్తే మంచికి మంచి, చెడుకు చెడు, ఎత్తుకు ఎత్తు అనుభవించవలసిందే. దేహంతో తాదాత్మ్యం లేకుండా చేసింది నిన్నేమీ అంటదు, నిన్ను ముట్టుకోదు, అది పునర్జన్మ హేతువుకాదు. మీలో చాలామంది ధనవంతులు ఉండవచ్చు, పది డిగ్రీలు ఉన్నవారు ఉండవచ్చు అయితే మీకు దుఃఖం ఎందుకు వస్తోంది. బాహ్యంగా చూస్తే మీకు ఏమీ లోటు లేదు. అయితే దుఃఖం ఎందుకు వస్తోంది. కారులలో నుండి, డబ్బులో నుండి, పదవులలో నుండి శాంతి రాదు. డబ్బు వలన కొన్ని కంఫర్ట్సు రావచ్చు. ఆనందం, సుఖం, శాంతి లోపల నుండే రావాలి, అవి బయట నుండి వచ్చేవి కావు. లోపల నుండి ఆనందం, శాంతి మీకు అందుతూ ఉంటే బాహ్య పరిస్థితులు ఎలా ఉన్నా అవి మీ ఆనందానికి అడ్డురావు. ఈ మధ్య ఒక భక్తుడి ఇంట్లో దొంగతనం

జరిగింది. 2 కాసుల బంగారం, 30వేల డబ్బు పట్టుకెళ్ళిపోయారు. ఆయన ఏమి చెప్పారు అంటే నేను పొందే శాంతిని, ఆనందాన్ని వాడు పట్టుకెళ్ళలేదు, నా భౌతికసంపదను తీసుకొనిపోయాడు, నా ఆధ్యాత్మికసంపదను వాడు తీసుకొని వెళ్ళలేదు అన్నారు. దేహానికి వచ్చే చావు కూడా నా ఆధ్యాత్మికసంపదను పట్టుకొని వెళ్ళలేదు, ఈ దొంగ ఎక్కడ పట్టుకొని వెళ్ళగలడు అన్నారు. గతించిన గొడవలు పూర్తిగా మర్చిపో, అస్తమానూ వాటిని జ్ఞాపకం తెచ్చుకొంటూ ఉంటే అదే మాయ. మంచి ప్రారబ్దం, చెడు ప్రారబ్దం అంతా స్వప్నమే. అది స్వప్నం అని నీకు తెలియటం లేదు, అది నిజం అనుకోవటం వలన నీకు దుఃఖం వస్తోంది. దేహము నేను అనే తలంపు నిజం అనుకోవటం వలన అదృష్టం, దురదృష్టం నిజం అని నీకు అనిపిస్తోంది. అందుచేత నీవు సాధన చేసి దేహము నేను అనే తలంపును తొలగించుకో. ఒక్కసారి హైజంప్ చేసి ఆ తలంపు నుండి బయటపడదాము అనుకోవద్దు. నీవు జాగ్రత్తగా క్రమశిక్షణ అలవాటు చేసుకొని దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి.

నీవు సాధన చేసేటప్పుడు ఆటంకాలు వస్తాయి, కంగారు పడకు. నెమ్మదిగా అభ్యాసం చేస్తూ, లోపల వైరాగ్యం పెంచుకొంటూ వాటిని తొలగించుకో. ఒకవేళ నీకు పుణ్యప్రారబ్దం వెంటాడుతూ ఉంటే అదే నిజం అనుకొని పొంగిపోవద్దు. నీవు ఎగిరి ఎగిరి పడుతున్నావు అనుకో, అది నీ అహంకారానికి గుర్తు. నీవు ఎందుకు ఎగిరి పడుతున్నావో కారణం నీకు తెలియకపోతే నీవు ఎగిరిపడటం మానవు. లోకంలో చాలాసంపద ఉంది కాని భగవంతుడు మీకు ఎంత అయితే కేటాయించాడో అది మాత్రమే మీకు వస్తుంది. మీరు కోరుకొన్నా ఎక్కువ రాదు. అంత సంపద మాకు వద్దు అని మీరు అనుకొన్నా అంత సంపద మీకు వస్తుంది. భగవంతుడు మీకు కేటాయించింది మీకు వచ్చి తీరుతుంది, పది మంది దానిని ఆపాలన్నా ఆగదు. మీకు కేటాయించనది మీరు ప్రయత్నం చేసినా రాదు. మీరు జపం చేసినా, ధ్యానం చేసినా మనో దేహములతో తాదాత్మ్యం తగ్గించుకోండి. మనో దేహములతో తాదాత్మ్యం తగ్గిపోతే మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా కూడా ఏమీ అనిపించదు, దున్నపోతు మీద వర్షం కురిసినట్లుగా ఉంటుంది. మనో దేహములతో ఉన్న తాదాత్మ్యం తొలగించుకోవటానికి మీరు ప్రయత్నం చేస్తూ ఉంటే అంతర్యామిగా ఉన్న నారాయణుడు చూస్తున్నాడు కదా, ఆయన మీ అహంకారాన్ని ఎక్కడికి గెంటేయాలో అక్కడకు నెట్టేసి, దానిని కాల్చి బూడిద చేసి, మీకు అమృతానుభవాన్ని కలుగజేస్తాడు. అమృతానుభవం మీకు కలిగింది అనుకోండి ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు, ప్రయాణాలు చేయనక్కరలేదు, ఇంక మీకు దుఃఖం లేదు, జన్మలు లేవు, బంధం లేదు, ఏమీ లేదు. అట్టి స్థితిని మీకు ప్రసాదించేవాడే గురువు, వాడే నారాయణుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 13-11-06 సోమ | జువ్వలపాలెం |
| 19-11-06 ఆది | తణుకు క్షత్రియ కళ్యాణ మండపం |
| 20-11-06 సోమ | గొరగనమూడి |
| 28-11-06 మంగళ | పాతాళ మెరక |
| 29-11-06 నుండి 05-12-06 వరకు అరుణాచలం క్యాంపు | |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# నిజమైన నేను

నేను అని ఉచ్ఛరించకుండా మనము ఉండలేము. అట్టి 'నిజమైన-నేను' యొక్క లక్ష్యార్థము సచ్చిదానంద పరమాత్మయే! నిత్యానంద అద్వయ స్వరూపమగు ఏ రసము నందు యోగులు నిరంతరముగా రమించుచుందురో అట్టి తత్త్వమే నిజమైన-నేను. నాకు తెలియబడే సర్వమునూ 'నేతి-నేతి' అని నిషేధించగా మిగిలెడి శుద్ధ తత్త్వమే నిజమైన-నేను.

అహం శబ్ద లక్ష్యార్థము, అహంవృత్తికి సాక్షియైనది, నిష్ప్రపంచ స్వరూపము అగు కేవల ఉనికియే 'నిజమైన-నేను'.

గమనాగమనములు, జనన మరణములు మున్నగు వికారములు లేని నిర్గుణ, నిరాకార తత్త్వమే 'నిజమైన-నేను'. తత్త్వమస్యాది మహావాక్యములందు 'తత్' పద అర్థమే 'నిజమైన-నేను'. ఏ నిజమైన నేను ఆధారముగా లేనిదే నేను, నీవు అను వ్యవహారమే లేదని తెలుసుకొను జ్ఞానమే 'నిజమైన-నేను'. సకల చరాచర జగత్తుకు ఆధారమైనది, శాంతియే స్వరూపముగా కలిగిన అట్టి తత్త్వమును 'తాను'గా అనుభవములోనికి తెచ్చుకొనుటయే మానవ జీవిత గమ్యము.

**- చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం

# బ్రహ్మంలో బహుళత్వం లేదు - బహుళ్వాన్ని కల్పించుకొంటే భంగపడతావు

పరబ్రహ్మం ఒక్కటే. దానికంటే వేరైనది ఏదైనా ఉంటే మనం కోరుకోవచ్చు. కళ్ళల్లో దోషం ఉంటే రెండు చంద్రులు కనిపిస్తారు. ఆత్మ జ్ఞానం కలగనంతకాలం మనకన్న భిన్నంగా రెండవ వస్తువు ఉన్నట్లుగా కనిపిస్తుంది. అద్దాల గదిలోకి మనం వెడితే మన రూపమే అనేక రకాలుగా ఉన్నట్లు కనిపిస్తుంది. మనకన్న బుద్ధిలో పరిణితి చెందని, పిచ్చుక, కుక్క బహుళత్వాన్ని కల్పించుకొని పొడుచుకొని, మొరిగి భంగపడతాయి. అద్దంలో ఎన్ని దృశ్యాలు కదలినా అద్దం ఎప్పుడూ వికార రహితంగానే ఉంటుంది. అలాగే మనం నిత్య జీవితంలో ఎవరైనా ఏదైనా అన్నా అద్దంలా ఉండాలి. తత్వ విచారణ ఉంటే, బహుళంగా కనిపించే, రూప-నామాలు అన్నీ పలాయనం అవుతాయి. అంటే మనలను ఎవరైనా పొడిగినా, విమర్శించినా, మనలను మనమే పొగుడుకొంటున్నట్లు, విమర్శించుకొన్నట్లుగా భావించాలి. సర్వత్ర సమదృష్టి కలగనంతకాలం ద్వేషబుద్ధి విడనాడనంత కాలం, ధ్యానధారణ కలగటమే అసంభవం. మనస్సు దేనినైనా కోరి విచారిస్తూ ఉన్నా దేనినైనా ఆమోదించి, నిరాకరించినా, సంతోష విచారాలు పొందినా బంధింపబడినట్లే. బంధం అంటే ఏమిటో క్షుణ్ణంగా అర్థం చేసుకొన్న బుద్ధికి భంగపాట్లు ఉండవు. కైవల్య స్థితి ఊహ మాత్రంగానైనా అందుతుంది. శ్రీనాన్నగారు అంటారు "మిమ్ములను ఎవరైనా ఎలా ఉంటున్నారు? అంటే తలపోటు అనో, రొంప అనో, బి.పి. మోకాళ్ళ నెప్పలనో అంటూ ఎన్నో రోగాలు చెప్పకొంటారు. అవి అన్నీ శరీరానికి సంబంధించినవి మాత్రమే. ఆ రోగాలు ఆత్మకు ఏమీ లేవు అవి అన్నీ మీకే అని ఆరోపించుకొని గోల గోల క్రింద ఉంటున్నారు" అన్నారు. కాబట్టి ఆ బ్రహ్మమే మనం అనే భావాన్ని సదా నిలుపుకోవాలి. గురు భక్తివల్ల బ్రహ్మ పదాన్ని అనుభవించటం సాధ్యమౌతుంది. స్ఫటికాన్ని నల్లగుడ్డపై పెట్టినా, ఎఱ్ఱ గుడ్డపై పెట్టినా, నేను నలుపైపోయాను తీసేయండి అని ఏడవదు. లేదా నేను ఎఱ్ఱగా ఉన్నానని మురిసిపోదు. నిజానికి స్ఫటికంలో ఏ రంగూ లేదు. అన్నీ కల్పించబడ్డవే, అలాగే మనం పెళ్ళి కూతుల్లు నలుపు అయితే ఏడుపు, పెడబొబ్బలు, తిరస్కారం. ఎరుపైతే ఆనందం, స్వీకారం. దైవీ సంపద అక్కరలేదు. ఈ సురూపాలు, కురూపాలు ఆ లీలామానుషమూర్తి వేసుకొన్న వేషాలు. మన కళ్ళు తెరిపించటానికి ఆడే నాటకం. ఆత్మలో బహుళత్వం లేదు. ఈ నిజాన్ని గ్రహించి, నిర్మలంగా నిశ్చలంగా జీవించటమే జీవిత ధర్మము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం